# వీరనాయకుడు

తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి



నవలిక

# వీరనాయకుడు

(నవలిక)

తల్లావఝ్ఝుల పతంజలి శాస్త్రి

చినుకు పబ్లికేషన్స్,

గాంధీనగర్, విజయవాడ.

VEERANAYAKUDU
(Novel)

PATANJALI SASTRY
First Edition: December, 2012

Copies:500

© Writer

Patanjali Sastry
86-4-16/1, Vadrevu Nagaram

RAJAHMUNDRY- 533 103

Cell:9440703440

For Copies:

CHINUKU PUBLICATIONS,

All Leading Book Shops

DTP, Printing & Publisher:
CHINUKU Publications,
Datta's Naya Bazar,
Opp: Raj Yuvaraj Theaters, Gandhinager,
Vijayawada- 520 003.

Ph: 0866-6640595; 9848132208

Editor- chinuku@yahoo.com

# అంకితం

డా. డి.వెంకటేశ్వరరావు

డి.వి.శ్రీనివాసరావు

ఆర్.వెంకటేశ్వరరావు

ఓరుగంటి సత్యప్రసాద్

ప్రేమతో...

పతంజలి శాస్త్రి

కార్తీకం, 2012

# వీరనాయకుడు

**చె**ట్లు పలచనై సాయంకాలపు టెండ మీద పడ్డప్పుడల్లా గుఱ్ఱం శరీరం మెరుస్తోంది. కొంచెం పొద్దెక్కిన తరువాతనే రాజమహేంద్రవరం నుంచి బయలుదేరగలిగే డతను. గోదావరి గట్టున వీరభద్రస్వామిని దర్శించుకుని గోదావరి ఒడ్డున అలాగే నిలబడిపోయా డతను. నిండుగా లోతుగా ఎండలో మెరుస్తూ వెళుతోంది నది. నది కావల పల్చబడ్డ అడవి. చీకటి పడ్డ తరువాత అటోవేపు నది దగ్గిరికి రావడానికి ధైర్యం కావాలని చెప్పే రతనికి. వేంగిలో అడవి ఉందో అడవిలో వేంగి ఉందో అర్థంకాలే దతనికి. గోదారిలో యువకులు ఉత్సాహంగా ఈదులాడుతున్నారు. మెత్తగా తేలుతూ రెండు పెద్ద పడవలు ఆవలి తీరానికి వెడుతున్నాయి. గట్టు మీద చెట్ల కింద బ్రాహ్మణ యువకులు మంత్రాలో వేదాలో పెద్ద గొంతుతో నోటి నిండా చెప్పుకుంటున్నారు. అప్పుడే బోయీలు పల్లకీ దించారు. మెడలో నాలుగు పేటల ముత్యాల హారాలతో ఓ ముసలిఅతి కష్టం మీదపల్లకీ దిగి నుంచున్నాడు. ఎంతసేపు చూసినా ఎంతసేపు నుంచున్నా నది అల్లుకున్న ఆ ఉదయపు మాయాజాలాన్ని తొలగించుకుని బయటిపడ్డం అతనివల కాలేదు. ఎంతసేపు ఈదులాడినా తనివి తీరందే. అది ఉదయపు ముచ్చట. ప్రస్తుతం ఆశ్వికుడు, అశ్వంకూడా అలసి తడిసిపోయారు. చుట్టూరా అడవి చీకటి చెమర్చేలోగా ఏదో ఒక గ్రామం చేరుకుని రాత్రి అక్కడే గడపాలి. గుఱ్ఱాన్ని అదిలించి నడకవేగం పెంచాడతను.

క్షణంలో కనుమరుగయేదే!

అతని కనుకొలుకుల్లోంచి ఎడంవేపు చెట్టుకింద శిలాఫలకం జారిపోయింది. అప్రయత్నంగా నిలిపివేశాడు గుఱ్ఱాన్ని. వెనక్కి వెళ్లి గుఱ్ఱం దిగి చెట్టుకిందికి వెళ్లి చూశాడతను.

పెద్ద శిలాఫలకం. ఫలకం మీద శిల్పం చూడగానే అతనికి ఆశ్చర్యం కలగలేదు. కింద చెక్కిన

పేరు చూశాడు ఆశ్వికుడు. గోదావరి ఆవలి తీరం నుంచి అనేక జనపదాల్లో ఇటువంటి శిల్పాల్నే చూశా డతను. భుజం మీంచి వేలాడుతున్న తలపాగ, గుర్రం మీద కూచున్న యోధుడు. ఒక చెయ్యి నడుం పటకానుంచి వేలాడుతున్న కత్తిమీద. ఈ యోధు డెవరో వీరోచితంగా యుద్ధంలో మరణించి ఉండాలి. ఎన్నిసార్లు కళ్లపడ్డా స్వర్గస్థుడైన ఆ వీరుడి గురించి ఎవరినీ అడిగే అవకాశం కలగ లేదతనికి. గుర్రం వేగంగా మళ్లీ ముందుకు బాగా వెళ్లిన తరువాతగానీ అతనికి స్ఫురించలేదు. మరణించి వీరుడి స్మృతి శిలాఫలకాలన్నీ ఒరిగి దరిదాపు కింద పడిపోయి ఉన్నాయి. అతగాణ్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. దరిదాపు అన్ని చోట్లా పిచ్చి మొక్కలు తీగలు ఫలకాన్ని ఆక్రమించాయి. ప్రజల జ్ఞాపకాల మరుగున పడిపోయి ఉంటా డనుకున్నాడు ఆశ్వికుడు. చుట్టూరా పచ్చగా ముసురుకున్న అడవి రక్తనాళంలా ఎడ్లబండి వెళ్లడానికి అనువుగా ఎర్రటి దారి. అడవిపలచబడి, ఏరుదాటి మైదానంలోకి రాగానే ఎండ ఏటవాలుగాపడింది. ఒకసారి ఆగి పరికించాడు ఆశ్వికుడు. దూరంగా కొండకింద పరుచుకున్న గ్రామం అస్పష్టంగా కనిపించింది. దౌడు తీయించాడు గుర్రాన్ని. బాట ఒంపు తిరిగిన చోట ఒక పెద్ద గుట్ట. దాని చుట్టూ ఒత్తుగా చెట్లు పెరిగి ఉన్నాయి. దూరం నుంచి గుట్ట మీద పెద్ద రాయి కనిపించింది. అందుకే అతనికి గ్రామం సరిగ్గా కనిపించలేదు. ఒంపు తిరుగుతూండగా వేగం బాగా తగ్గించి గుట్టవేపు చూశాడతను. గుట్టంతా మొక్కలు, పాముపుట్టలూ, చీమ దూరడానికి దారిలేదు. ఎండ గుట్ట మీది రాయి మీద పడుతోంది. గుట్టవేపు గుర్రాన్ని నడిపించాడతను. ఈసారి ఆశ్చర్యపోయాడతను. గుట్టమీద కనిపించినది రాయి కాదు. కోలగా గండరించి రాతి మీద ఇప్పుడు స్పష్టంగానే ఆశ్వికయోధుడి శిల్పం కనిపిస్తోంది.రాయి మట్టిలో కూరుకుపోయి ఉంది. పుట్టలు పెరిగాయి. పుట్టలు పెట్టిన వీరుడిలా కనిపించా డతను. వీరుడి పేరు కొనువీడులో శిల్పం కిందిభాగంలో చదివేడతను. వీరనాయకుడు నాగులాంటి వీరుడై ఉండా లనుకున్నా డతను.

చటుక్కున చీకటి పడిపోయింది. గ్రామంలో చాలాచోట్ల, దారి పక్కనా దివిటీలు వెలిగాయి. గుర్రం దిగి గ్రామాధికారి ఇల్లు అడుగుతూ గ్రామం నడిబొడ్డుకి చేరుకున్నాడు ఆశ్వికుడు. గుర్రాన్ని నడిపించుకుంటూ వస్తున్న ఆగంతకుణ్ని చూసి మాటలు ఆపేశాడు గ్రామాధికారి. చీకటిపడ్డ తరువాత గ్రామంలోకి వచ్చి పరదేశిని చూస్తూ కరణం, మరో ఇద్దరు వ్యక్తులు ఆశ్చర్యంతో, అనుమానంతో అలాగే ఉండిపోయారు. ముందు గ్రామాధికారి తేరుకుని అన్నాడు.

''ఎవరు బావూ తవరు? నేను గ్రామాధికారి మల్లయ్యని మాట్లాడుతున్నాను.''
అభివాదం చేసి ఆశ్వికుడు పరిచయంచేసుకున్నాడు.

''పెన్నేటి సీమ స్వామీ. సంచారం చేస్తూ ఇట్లొచ్చేను''. పక్కనే ఉన్న కరణంగారినీ మిగతా ఇద్దరు గ్రామసభ సభ్యుల్ని పరిచయం చేశాడు మల్లయ.

''తవరు ప్రయాణంలో అలిసిపోయినారు. ముందు స్నానం చేదురుగాని. రండి.''

గ్రామాధికారి ఇల్లు విశాలమైన పెంకుటిల్లు. ముందు అరటిచెట్లు, రెండు పనసచెట్లు, రెండు పాదులు, వాటి పక్కనే నుయ్యి. ఇంటి గోడనానుకుని బయట గుమ్మానికి అటూ ఇటూ పెద్ద అరుగులు. గుర్రాన్ని బయట కట్టి లోపలి కొచ్చేడతను. గుర్రానికి నీళ్లూ తిండీ పురమాయించాడు మల్లయ. గ్రామం సంగతులు చెబుతూ పెన్నేటి సీమ గురించి అడుగుతూ కొసరి వడ్డిస్తూ, కమ్మటి ఆతిథ్యం ఇచ్చాడు గ్రామాధికారి. ఆకలిమీద ఉన్నాడేమో ఆగంతుకుడు అన్నం వడ్డించిన తల్లికి బోలెడు సంతోషం కలిగించాడు. నూతి దగ్గిర చెయ్యి కడుక్కుంటూ పైకి చూశాడతను. పున్నమి వెల్లువ. దివిటీలు వెలవెల పోతున్నాయి. చల్లగా ఉన్న మాఘమాసపు ఎండలా ఉంది. సన్నటి వెదురుబద్దలతో నేసిన మంచం వేశా రతనికి. గ్రామం నిశ్శబ్దంగా ఉంది "ఇక్కడ అడవి జంతువుల భయం ఉందా?"

"ఏవీ లేదు. ఎప్పుడో నా చిన్నతనంలో పొలిమేరవతల పులులు కాపడేవి. ఇప్పుడేవీ లేదు. ఇప్పుడవన్నీ పొలాలై పోయినాయి. అడివిలో మనుషులుండేవారు. వారు చాలా మంది దండులో చేరేరు. కొంతమంది పొలాలు జేసుకుంటున్నారు. మా కాపుల్లో కలసిపోయినారు. అవతల గ్రామాల్లో కూడా వారింకా చాలామందే ఉన్నారు." ఇద్దరూ మాటల్లో పడ్డారు. కొంచెం దూరంగా బయట వన్నెల్లో తడిసిన ఏదో పాట వినబడింది. ఒకసారి పాట వస్తున్న వేపు చూసి మల్లయ గ్రామంలో కట్టిన శివాలయం గురించి చెప్తున్నాడు. పాట దగ్గిరవుతోంది. బలమైన కంఠం వెన్నెల్ని ఒత్తిగించుకుంటూ చెవుల్లో పడుతుంటే ఆశ్వికుడు మాటలు వినడం మానేశాడు. పాట గ్రామాధికారి అరుగు దగ్గిర ఆగిపోయింది. అస్పష్టంగా ఎవరివో మాటలు, నవ్వులు, పిలుపులు వినబడుతున్నాయి.

"మా ఆసాది పెద్దియ. ఈ కొండ దిగువ గ్రామాన్నీ తిరుగుతాడు. పొద్దుపొడిచాక ఎక్కడుంటే అక్కడే ఉండిపోతాడు. ఆడి చుట్టూ ఏడికి బోయినా జనం చేరతా ఉంటారు. మా దేశాన ఆడికి తెలీని సంగతి లేదు. చూస్తారా సామీ?" అంటూ మల్లయ ఆగంతకుణ్ని బయటికి తీసుకొచ్చేడు. నిజానికి బయట పెద్దియ దగ్గిర ఎవరూ లేరు. వీళ్లు బయటకు వస్తూండగానే ఇద్దరు ముగ్గురు వెళ్లిపోతూ కనిపించేరు. అరుగు మీద గుడ్డ పరుచుకునికూచున్నాడు పెద్దియ. మల్లయని చూడగానే లేచి నుంచున్నా డతను. "దండాలు సామీ."

"ఏమి పెద్దియా కడుపు నిండిందా?"

"అవుసామీ." ఆశ్వికుణ్ని చూస్తూ అన్నాడతను.

కళ్ళప్పగించి పెద్దియన చూస్తూ ఉండిపోయా డతను. చెయ్యెత్తు నల్లటి మనిషి, చెక్క శిల్పంలా. తల జుట్టుమడిచి పక్క పెద్ద కొప్పు. మోకాళ్లమీదకి ధోవతి. మెడలో రెండు మూడు పూసలపేరులు. చెవులకి పైన,కింద అలంకారాలు. ముక్కుకి సన్నటి బంగారు తీగ కొంచెం గడ్డంపెరిగి తాను ఎన్నడూ చూడని గొప్ప ఇంద్రజాలికుడి వలె కనిపించాడు పెద్దియ. పరిచయం చెయ్యగానే వినయంగా దండాలు పెట్టేడతను. కాసేపు మాట్లాడి లోపలికి వెళ్లిపోయాడు మల్లన్న. ఇద్దరూ

పక్కపక్కనే  కూచు న్నారు. గ్రామం నిశ్శబ్దంగా ఉంది. ఇద్దరు వ్యక్తులు కంబళ్లు కప్పుకుని చేతిలో దివిటీలతో వీళ్లవేపు ఒకసారి చూసి వెళ్లిపోయారు. ఒకళ్ల సంగతులు ఒకరు ఇద్దరూ ఆకలేసి ఆరగిస్తున్నట్టు ఆరగించారు. పెద్దియ భౌతిక ప్రపంచం గోదావరి దాటి విస్తరించలేదు. ఆశ్వికుణ్ని పెద్దియ మంత్రం వేసినట్టు కట్టి పడేశాడు. వెన్నెట్లో కూడా మెరుపు కనిపించే కళ్లూ, ఈ సీమ నల్లరేగడిలాంటి మనిషీ, మాట్లాడుతున్నా పంబ కొడుతూ పాడుతున్నట్టే ఉంది. ఇక్కడి నదీనదాలూ సెలయేర్ల దాహం పుచ్చుకున్నట్టున్నాడు. పూలనీ పళ్లనీ పరిమళాన్నీ వెతుక్కుంటూ వచ్చే సీతాకోకచిలుకల్లా కథలూ గాథలూ అతన్ని ఆశ్రయిస్తా యనుకున్నాడు ఆశ్వికుడు. అతని మాటలు వినడంలా కాకుండా బెల్లం తీగె లాంటి అతని కంఠం మాటల్ని డుల్చుకుని ఆశ్వకుణ్ని అలుముకుంటోంది. చటుక్కున పెద్దియని ఆగమన్నట్టు చెయ్యి చూపించి అడిగా డతను.

“పెద్దియ స్వామీ గోదారి నుంచి ఈ సీమ వరకూ ఎన్నో విగ్రహాలు చూశాను అన్నీ దారంట పడున్నాయి. ఎవరా వీరుడు? మిమ్మల్ని ఏలిన ఏలికనా? దండు నాయకుడా? ఊరి బయట గట్టుమీదున్నాడు. ప్రశ్నార్థకంగాచూశాడు ఆగంతకుడు-  పెద్దియ కాసేపు  అతని వేపే చూసి అన్నాడు. “వీరనాయకుల వారు.”

“అవును. పేరు చూశాను. ఆ విగ్రహం వారిదేనా?”

“అవు.”

ఆశ్వికుడికి వీరనాయకుడి గురించి తెలుసుకోవాలనిపించింది.

“ఎవరు వారు. వీరనాయకులవారు?”

“చెందురుడు గాలికొండ మీది కెక్కినాడు. ఇనగలుగుతవా?”

“తెల్లారినా వింటా సావీ.”

పెద్దియ నవ్వి అన్నాడు. “వీరనాయకుడి కద ఎప్పుడూ ఎవరూ అడగరు. బాపనమ్మ సేపం సామీ. సేపం తగిలి నాయకుడు మట్టిలో కలిసినాడు. ఈ సీమకొచ్చి సేపం నెత్తిన బెట్టుకుని మోసినాడు.” కాసేపు కళ్లు మూసుకుని మొదలుపెట్టేడు పెద్దియ.

“నాగుబాము ఏ పుట్టలో పుడతదో మనకి ఎరిక ఉండదు. వీరుడూ అంతే సామీ. మడిసెత్తున కస్సుమని లేచి పడగ పరిచిందాక  నాగు సంగతి తెలవదు. నాగులాంటి వీరుడూ అంతే.”

వీరనాయకు డెవరో ఎవరికీ తెలియదు. తాడంత మనిషి. ఎంత పెద్ద విల్లు పట్టినా ఆడుకునే బాణంలా ఉండేది. నాయకుడు గుర్రం దిగడం చూడ్డం ఓ ముచ్చట. పెదాల చివర ఎప్పుడూ విచ్చుకోడానికి  చిన్నినవ్వు  మొగ్గ. వీరనాయకుడందగాడు కాదు కానీ అతగాడు కళ్లతో ఏమైనా చెయ్యగలడు. పెదాలు నవ్వినా కళ్లు నవ్వవు. పెనుగాలిలాగ ఒక చైత్రమాసపు ఉదయం ముప్ఫయిమంది విలుకాళ్లతో గుర్రాల మీద రాజమహేంద్రవరకోట ప్రాకారం వెలుపల వేంచేసి ఉన్న ముల్లగూరమ్మ ముందు మోకరిల్లేడు. కోట చుట్టూ మూడు కొండలు, ప్రాకారం చుట్టుకుని అగడ్త. లోతయిన గోదావరి. వేంగి కోటను ముట్టడించడం కష్టమే. అప్పుడే  తల్లికి  దీపం పెట్టి,

కుంకుమ పెట్టి పూజారయ్య గుడిముందు నుంచున్న నలుగురైదుగురుతో మాట్లాడుతున్నాడు. కొండపక్కనుంచీ తీరిగ్గా గుడివేపు వస్తున్న ఆశ్వికుల్ని చూసి అవాక్కయిపోయాడు పూజారయ్య. అతని చూపు వెంట వెనక్కి తిరిగి చూశారతని శ్రోతలు. గుర్రాలు రేపుతున్న పల్చటి ధూళిపొరల్లోంచి రౌతుల్ని చూశారు వాళ్లు. గుర్రాలు బాగా దగ్గిరయ్యే వరకూ మాటలేదు వాళ్లకి. వాళ్లకి పదిధనువుల దూరంలోనే గుర్రాలు దిగేరు ఆగంతకులు. వీరనాయకుడు ముందు నడుస్తున్నాడు. వారిని చూడగానే పరదేశీయులని తెలిసిపోయింది. గుర్రాలకి వేలాడుతున్న ధనువులు వేంగి విలుకాళ్ల ధనువులు కావు. ఇవి పెద్దవి.

''మాది కొండవీటి సీమ. అమ్మని సేవించుకోవాలి. దండనాయకులవారిని చూడాలి. అమ్మదీవించాల ముందు.'' అన్నాడు వీరనాయకుడు. పూజారయ్య తేరుకుని గుడివేపు దారిదీశాడు. ఎవరు వీళ్లు? ఒళ్లు చమటపట్టిం దతనికి. ఇటుకల గోడలో వెడల్పాటి రాతిగుమ్మం దాటి అందరూ లోపలికి వచ్చేరు. గుడిముందూ వెనకా పొగరుమోతు వీరుల్లా బలిసిన చెట్లు. దండాలు పెట్టుకుని, తల్లి కుంకుమ అద్దుకుని వీరనాయకుడు కొన్ని వెండి వరహాలు అమ్మపాదం ముందు పోశాడు. బయట చెట్ల కిందకి చేరి కుండల్లో నీళ్లతో దాహం పుచ్చుకుని, వీరనాయకుడు, అతని సన్నిహితులు ఇద్దరు పూజారయ్యతో మాటలు మొదలుపెట్టేరు. మిగతా అనుచరులు గుంపుగా చెట్ల కింద కూచున్నారు. అప్పటికే పదిమంది పోగైనారు. ఆశ్వికులతో మాటలు కలుపుతున్నారు. ఆ సాయంకాలనికి పరదేశి ఆశ్వికులు కోట వెలుపల విడిది చేసి ఉన్నారనీ, సాయుధులనీ మహా దండనాయకులకి వర్తమానం వెళ్లింది. చీకటి పడుతూండగా రేవు దగ్గిర ఉండే ఇద్దరు వేగుల్ని రాజోద్యోగం నుంచి తొలగించారు. రాజధాని నుంచి బహిష్కరణ కూడా అయిపోయింది. వీరనాయకుడు అనుచరులతో ఉదయం ఎప్పుడో గోదావరి దాటేడు. మర్నాడు ఉదయం వీరనాయకుణ్ని రాజాధికారులు కలిశారు. వీరనాయకుడి పాదు ఎక్కడో, పెరిగినదెక్కడో, కొలువెక్కడో అతగాడి పుట్టుమచ్చలతో సహా సమస్త వివరం తెలుసుకుని అతని వాలకం అర్ధం చేసుకుని మాటలు పోల్చుకుని వెళ్లిపోయారు వాళ్లు. అప్పటికే మిగతా యాత్రీకులలో నలుగురు వేగులు కలసిపోయారు. ముప్పయిమందీ మర్నాటి నుంచీ ఎక్కువ సేపు గోదావర్లోనే ఉండిపోయారు. వీరభద్రుణ్ని రోజుకి రెండుసార్లు కొలుచుకున్నారు. ఇవన్నీ లోపలికి చేరుతున్నాయని వారికి తెలుసు. మరో రెండు మూడు రోజుల తరువాత కోటలోంచి వర్తమానం వచ్చింది. వీరనాయకుడూ అతని అనుచరులు ఇద్దరూ మహాదండనాయకులవారి నివాసం ముందు నుంచున్నారు. ప్రధాన ద్వారం దగ్గిరే వారి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. లోపలికి వెళ్లిన తరువాత ఎప్పుడోగానీ దండనాయకులవారి దర్శనం కాలేదు. వీరనాయకుడి వినయ గాంభీర్యం, శరీరం అదిమిపెట్టి ఉంచిన అతి శౌర్యం, ముక్కుసూటితనం దండనాయకులవారికి నచ్చేయి. వీరు అప్పటికే పెద్దలు. దొడ్డ మనిషి. సాక్షాత్తూ వేంగి ప్రభువులకి ఆంతరంగికులు. పైగా రాజమాత కనుసన్నల్లో మెలుగుతున్నవారు. అప్పటి నుంచి ఏడు దినాలు ముగ్గురూ దండనాయకుల వారి దర్శనం

చెయ్యవలసి వచ్చింది. మూడు మారులు మరొక ఇద్దరు రాజ్యోద్యోగులు కూడా దండనాయకులవారితో ఉండి అనేక సందేహాలు తీర్చుకున్నారు. వీరనాయకుడి ప్రతి కదలిక, మాట, కనుబొమ్మల విరుపుతో సహా చిత్రకారుల్లా అధికారులు అతత్యంత నిశితంగా పరిశీలించారు. మరొక నాలుగైదు దినాల తరువాతగానీ దండనాయకుల వారికి చక్రవర్తితో ప్రస్తావించే అవకాశం కలగలేదు. - మరి కొన్ని దినాల తరువాత వీరనాయకుడికి అతని ఒక్కఅనుచరుడికి మాత్రం రాజదర్శనం కుదిరింది. వారి సమక్షంలోనే కోరుకొండ కోటలో దండు శిక్షకుడిగా వీరనాయకుణ్ణి నియమిస్తూ ఉత్తరువు చదవబడింది. ఎక్కడో ఎక్కుపెట్టి విడిచిన బాణం కోరుకొండ సీమలో పడ్డట్టు వీరనాయకుడు కోరుకొండలో పాదం మోపేడు.

కోరుకొండ సమీప గ్రామంలో మంచి స్థలం ఎంచుకుని అనుచరులతో సహా నివాసాలు ఏర్పరుచుకున్నాడు వీరనాయకుడు. రాజమహేంద్రవరంలో ఉన్నన్ని దినాలూ వాళ్ళు నగరంలో చీమల్లా సంచరించారు. రాజోద్యోగులు, వేశ్యలు, వ్యాపారులు అందరి దగ్గిరా నగరం గురించీ, రాజోద్యోగుల గురించీ సమాచారం సేకరించారు. గ్రామంలో చాలాకాలంపాటు అందరికీ కొత్తగానే ఉంది. గ్రామీణులకి పరదేశీ వారు వింతగా కనిపించారు. ముఖ్యంగా వారి మాటలు కొత్తగా అనిపించేవి. ఆగంతకులందరూ గ్రామీణులతో కలివిడిగా ఉండడం వల్ల, వీరనాయకుడి వ్యక్తిత్వం వల్లా మొత్తానికి కొత్తదనం పోయింది. వీరనాయకుడు ముందే, ఓ రాత్రి తన నలుగురు ఆంతరంగికులనూ పిలిచి అందరూ రెండు ముంతలు జీలుగుకల్లు సేవించిన తరవాత అన్నాడు. ''మనం గాలికి వచ్చినాం. పంటపొలాల్లో పడ్డాం. ఈ భూవి మనదిగాదు. ఈ సీమ మనది గాదు. బేతప్పా, మనోళ్లకి చెప్పు. కలిసిపోవాల. మనం గొడ్డుకారం తినేవాళ్లం. ఉట్టిగనే లేస్తది చెయ్యి. ఈళ్లతో గొడవరాటానికి ఈల్లేదు. మాటజారినా, చెయ్యి లేచినా పంబరేగుద్దని చెప్పు''. పొల్లుపోకుండా అందరికీ అదే చెప్పేడు బేతప్ప. వీరనాయకుడికి కోపం తెప్పించే తెగువ ఎలాగూ ఎవరికీ లేదు.

మంచినేల మీద మొక్కలు మెలిచినట్టు అందరూ అందరితో కలిసిపోయారు. అడవిలో వేటచెయ్యడం వాళ్ళకి అంత తెలిసేదికాదు. పిట్టల్ని, చిన్న చిన్న జంతువుల్ని వేటాడ్డంతప్ప రాత్రిపూట అడవిలో మాటువేసి గుంపుగా వేటచెయ్యడం తెలిసిన విద్యకాదు. మరికొంతకాం పట్టింది. అప్పటికి ఆకాశంలోంచి జారేయో భూమిలోంచి చిమ్మేయోగానీ ఎండలు కమ్ముకున్నాయి. పచ్చటి కొండల్నీ అడవుల్నీ కుమ్ములోపెట్టి ఆవిరి వేంగి మండలాన్ని ఉడికించింది. ప్రతీ ఏటా మామూలే ఇది. ఎండ సముద్రంలో కొండలు గిరికీలు కొట్టి సాయంత్రానికి దిమ్మదిరిగి పడుంటాయి. అప్పుడు నివురు తొలిగిన అగ్గిలాంటి సూరీడు కొండల వెనక ఎర్రబడతాడు. అట్లా ఏడాది తిరిగేసరికల్లా చుట్టూరా ఉన్న కొండల్లోకి వేటగాళ్లతో వెళ్లడం, కొన్ని జంతువుల జాడలు గుర్తుపట్టడం నేర్చుకున్నారు. బేతప్ప నాయకత్వంలో ఉన్న పాతికమంది వందమందిలా

విచ్చుకత్తుల్లా సానదేలేరు. పచ్చటి కొండలు, అవి జారవిడిచిన కొండ ఏర్లు, కలువలు నిండిన చెరువులు ఆగంతకుల్ని స్వస్థలాన్ని మరిపింపచేశాయి. వీరనాయకుడు రెండు విషయాలు మొదటే గ్రహించాడు. కోరుకొండ కోటలో దండు చిన్నది. ఊళ్లో ఉన్న గొర్రెల కన్నా ఒకటి రెండు తక్కువగా గుర్రాలు, దండులో చాలామంది చిన్న రైతులు. ప్రత్యేకం దండులో ఉన్నది కొద్ది మంది. ఈ వేంగి విలుకాళ్లెవరూ యుద్ధంలో గాయపడ్డవారు కాదు. కొన్ని సంవత్సరాల నుంచీ ఈ తరం విలుకాళ్లు ఎదిరించిన శత్రువుల కుందేళ్లు, అడవి పందులు. వేంగి ధనువులు చిన్నవి.

''కొంతకాలం నుంచీ వేంగి రాజ్యం ప్రశాంతంగా ఉంటోంది. మేమూ సుఖంగా ఉన్నాం.'' అన్నాడు కోరుకొండ దండనాయకుడు. వీరనాయకుడు నవ్వి అన్నాడు ''అట్లాగే ఉండాలని కోరుకుందాం. ఇప్పటికే చాలా నెత్తురు చూసుంటిమి గదా''.

వీరనాయకుడున్న గ్రామం, కూతవేటు దూరంలో ఉన్న మరో రెండు గ్రామాలూ గ్రామసభలు పెట్టుకుని ఎండాకాలంలో అడవి నరుకుతుంటారు. ఒక పద్ధతి ప్రకారం గ్రామ పొలిమేరల్ని విస్తరిస్తూ కొండలవేపు పంటభూముల్ని పరుచుకుంటారు. ఈ విస్తరణ కేవలం గ్రామ రైతులు సొంత భూముల్ని పెంచుకోడంకోసం చేసే పనికాదు. దీనికి రాజానుమతి అవసరం. రైతు సైనికులు, ఇతర గ్రామస్థులూ కలిసి అడవికి నిప్పుపెడతారు. అట్లా నిప్పు పెట్టి వదిలేసిన రాత్రులు అప్పుడపుడు కోతులు, ఎలుగులు, చేసే గోల గ్రామం వరకూ వినబడుతుంది. మరో చిత్రమైన విషయాన్ని గమనించాడు వీరనాయకుడు. ఈ గ్రామాల్లో కొంతమంది వ్యవసాయం పనులు చేసుకుంటూ పశువుల్ని మేపుకుంటూ గ్రామస్తులలో కలిసీ కలవకుండా ఉండే మనుషులున్నారు. ఇతర గ్రామాల్లో కూడా ఉన్నారు వీళ్లు. వీళ్లు ఒక్కోసారి రెండు మూడు గ్రామాల నుంచి పోగయి నెగళ్లు పెట్టి మాంసం కాల్చుకుతింటూ పాటలతో రాత్రిళ్లని చెదరగొడుతూంటారు. అప్పుడప్పుడు దేవతలకి బలినిస్తూంటారు దుబ్బుగడ్డిమేటులాంటి జుత్తూ, కొంచెం లావుపాటి పెదాలూ, వాళ్లలో వాళ్లు మాట్లాడుకునే భాష ఇతరులకి వెంటనే అర్ధం కావు. పండుగలు చేసుకుంటారు. ముసలి వెజ్జు అందరికీ వైద్యం చేస్తూంటాడు. అడవులు పోవడంతో లోపలి ఉండే ఆదివాసుల గ్రామాల్లోకి వచ్చి క్రమంగా వ్యవసాయ కుటుంబాల్లో కలిసిపోయిన వాళ్లూ, దండులో చేరినవాళ్లూ ఉన్నారు. అడవిని వాళ్లు వదిలేసినా, అడివీ, అడివి దేవతలూ వాళ్ల వదల్లేదు. మాట మారిందిగానీ పాట మారలేదు.

ముసలి వెజ్జు అడ్డాకు దొనెలో కొంచెం తేనెపోసి ఇచ్చాడు. వీరనాయకుడికీ బేప్పకీ ఒళ్లంతా తీపి అయినట్టనిపించింది. ఇద్దరికీ స్నేహం కుదిరింది. మరునటి ఏడాది పండగలకి వీరనాయకుడూ, అనుచరులూ నెగుడు చుట్టూ తిరిగి ఆడుతూ వాళ్లలో కలిసిపోయారు. తరువాత ఒకచోట కూచుని బేతప్పతో అన్నాడు, ''మనకీళ్లు కావాల. ఆళ్లతో వైనంగా ఉండమని చెప్పు మనోళ్లకి. రేయి బేతా మనం ఈడకొచ్చి కల్లుతాగి, తిండితిని కూచోడాని కనుకుంటున్నావా?

మన గురి రాజమండ్రం. అదీ. తొందరలేదు. రాజమండ్రం మన చుట్టూ తిరగాల.'' బేతప్ప ఆశ్చర్యపోయాడు. అతనికి అర్థంకాలేదని తెలుస్తూ ఉంది. ''చెప్తాలే! గవనం పెట్టుకో. రాజమండ్రం. వీరనాయకుడు కోరుకొండలో గోళుతీసుకుంటా కూచుంటాడని ఎట్లనుకున్నావురా బేతా? నా తెలివిడే నా దండు.'' భుజం తట్టి అన్నాడు బేతప్ప.

మొదట్లో వీరనాయకుడి దినచర్య, భోజనం, పడకతో సహా కోరుకొండ దండనాయకుడికి తెలుస్తూండేది. అప్పుడపుడు వీరనాయకుడు వెళ్లి సగౌరవంగా కలుస్తూండేవాడు. ఎప్పుడు వెళ్లినా ఉత్తచేతులతో వెళ్లేవాడు కాదు. ఒకసారి గణపతి దండనాయకుడి కూతురుకోసం మాట్లాడే రెండు మైనా పిట్టల్ని తీసుకెళ్లేడు. పాప కేరింతలు కొట్టింది. గణపతివారు నవ్వేరు నాయకుడి భుజం తట్టేరు. గ్రామం తిరిగొచ్చి ఆ రోజు రాత్రి బేతప్పతో అన్నాడు వీరనాయకుడు.

''బేతన్నా, వాడు నన్ను నమ్మడుబో. వాని కండ్లు నమ్మవు. వాని మూతి మాటాడే మాటలు వేరు. కండ్లు చెప్పేటివి వేరు. ఏం జెయ్యాలంటావురా? మన దారి కొస్తడా?'' రాత్రి పొద్దుపోయేవరకూ ఇద్దరూ మాట్లాడుకున్నారు. వెళ్లిపోతూ బేతప్ప అన్నాడు.

''అన్నా దినవారాలూ మనం జెప్పిన లెక్కనబోవు. ఓదానెంబడి ఒకటి. దినము మనం నెడితే నడుస్తదా. దానెంబట్నే మనం బోవాల. పొద్దుగాల మనోళ్లని కొండల్లోకి అంపుతా.'' నిజానికి తొందరపడ్డా అవసరపడ్డా గుర్రాన్ని అదిలించినట్టు దినాల్ని గెంటలేమని వీరనాయకుడికి తెలియకపోలేదు. మొత్తానికి మొదలైంది. రాత్రి సుఖంగా నిద్రపోయాడు వీరనాయకుడు. సూర్యుడింకా ఊరి చెరువులో ఉండగానే వర్షంలో తడిసినట్టు వ్యాయామం చేసి చల్లటి నేల మీద వెల్లకిలా పడుకున్నాడు నాయకుడు అప్పటికే బేతప్ప ఇద్దరు అనుచరుల్నీ, నలుగురు ఆదివాసి కాపుల్ని కొండల్లోకి  జాగ్రత్తలు చెప్పి పంపించాడు. వాళ్లు వెళ్లేరని తెలియజేశాడు బేతప్ప. స్నానించి అరిటాకులో ఆవిరి కుడుముల్ని తేనెలో ముంచి స్వీకరిస్తూ కిటికీలోంచి వెండిలా జారుతోన్న ఉదయాన్ని చూస్తూ నవ్వుకున్నాడు వీరనాయకుడు. అతనెపుడూ ఒంటరిగా ఉన్నా మెరుపులాంటి ఆలోచనలు కదిలినపుడు, చేనేతలాంటి వ్యూహం దట్టమైనపుడూ నవ్వుకుంటాడు. మనిషి ఎదురుపడగానే అతని పెదాలు విచ్చుకుని కళ్లు నిశితా లవుతాయి. తియ్యగా వేడిగా కుడుము ముక్కలు నోటినీ మనసునీ తీయబరుస్తున్నాయి. ఎండ చురుక్కుమనకుండానే కోరుకొండ బయల్దేరేడు వీరనాయకుడు.. నిజానికి బేతప్ప మరో ఇద్దరు విలుకాళ్లు వెడుతూంటారు. అప్పుడప్పుడు నాయకుడు వెళ్లి చూసి, దండాయకులవార్ని పలకరించి వస్తూంటాడు. వీరనాయకుడు వెళ్లేసరికి దండు వ్యాయామం చేస్తోంది. దండు కిచ్చే శిక్షణ ఒక పద్ధతి ప్రకారం, వాళ్ల సామర్థ్యాన్ని బట్టి ఏర్పాటు చేశాడతను. అతన్ని చూడగానే అందరూ వ్యాయామం ఆపి మౌనంగా చేతులు జోడించి అయిదు వరుసల్లో నుంచున్నారు. అంటే ఈ దినానికి వీరికిమాత్రమే శిక్షణ ఉంటుందన్నమాట. మల్లయుద్ధం విలువిద్య వంటి వాటిలో నైపుణ్యం పెరిగింది. సుఖంగా

తినికూచునే దండు కొవ్వు పూర్తిగా కరిగిపోయి కశ్మలంతుప్పు ఒదిలిన బాకుల్లా తయారవుతున్నారు. అప్పటికే వ్యాయామం చేస్తున్నారేమో ఒళ్లంతా చెమటతో తడిసిపోయింది. సూదంటురాయి అప్రయత్నంగానే ఆకర్షిస్తుంది. వీరనాయకుడూ అంతే. పైగా ఒక పద్ధతి ప్రకారం అమలుచేసే వ్యూహం కావడం వల్ల దండులో ప్రతి సైనికుడూ ప్రమాదకరమైన ఆకర్షణకు గురయ్యారు. కత్తిసాము, గురితప్పని అతని విలువిద్య, వ్యూహరచన, యుద్ధాన్ని ముందు శత్రుశిబిరంలోకి ఎట్లా పంపించాలి మొదలైన యుద్ధ విద్య ప్రదర్శించి వివరించినప్పుడు దండు కళ్లు ఆశ్చర్యంతో ఆరాధనా భావంతో విచ్చుకున్నాయి. వారికి కూడా తెలీకుండా కోరుకొండ దండు వీరనాయకుడి వ్యక్తిగత సేన అయి కూచుంది. నవ్వుకున్నాడు వీరనాయకుడు. అయితే అంత సంతృప్తిగా నవ్వుకోనివాడు దండనాయకుడు గణపతి. (''పులికి కూడు బెడితే కూడుతిని నిన్నూ తింటుంది.'') వీరనాయకుడి శిక్షణ గురించీ దండు గురించీ తెలుసుకుంటున్నాడు. స్వయంగా చూస్తున్నాడు. వీరనాయకుడు రాజసేవ చేస్తున్నాడని ఆయన వెంట్రుకవాసి కూడా నమ్మడం లేదు. స్నేహభావంతో, మర్యాదతో, చిరునవ్వు ఊతంగా చేతులు జోడించే వీరనాయకుణ్ని చూడగానే అతనిలో ఇద్దరు ముగ్గురు మనుషులు కనిపిస్తా రాయనకి. క్రమం తప్పకుండా ప్రతి మాసం నాయకుడూ బేతప్పా రాజమహేంద్రవరం వెళ్లి రాజమాత దర్శనం చేసి ఆమెకి పాదాభివందనం చేసి ఆమె ఆశీస్సులు మూటగట్టుకు వస్తున్నాడనీ, మహాదండనాయకులవారికి పుత్ర సమానుడైపోయాడనీ గణపతి వారికి తెలుసు. ఇదంతా ప్రభుభక్తి అనిగానీ, కృతజ్ఞతాభావం అనిగానీ ఆయన నమ్మడం లేదు. వీరనాయకుడి నిరడంబర జీవితం గురించి తెలిసిన కొద్దీ అతని మీద అనుమానం ఎక్కువవుతోంది. దీనికితోడు వీరనాయకుడి గతం గురించి మహాదండనాయకులవారు చెప్పిన వివరాలు మరీ మామూలుగా ఉన్నాయి. వేగుల్ని పంపించి వివరం తెలుసుకోమని దండనాయకులవారిని ఒప్పించడానికి పెద్ద అడ్డంకి వీరనాయకుడి పట్ల ఆయన అభిమానం, నమ్మకం. నిస్సందేహంగా వీరనాయకుడు రెండుకాళ్ల అపశకునం అని నమ్మేడు గణపతి. అతనిలో కలిగిన అలజడికి కారణం మాత్రం తెలియలేదు. ఊహించనూ లేదు. మరి కొన్ని సంవత్సరాలు గణపతులవారు జీవించి ఉంటే ఊహ అవసరం అయి ఉండేది కాదు. వీరనాయకుడు కమ్మెచ్చుతీసిన యోధుడు. విలుకాడు. అతని గురీ, గమనం ఎప్పుడూ తప్పవు. పొగరుమోతు గుర్రాన్ని లొంగదీసుకోవడం అతని ప్రత్యేకత.

కోరుకొండ రెండే ప్రాకారాలున్న కోట. వెడల్పాటి బలమైన ప్రాకారాలు మట్టితో నిర్మించినవి. అడవివేపు విస్తరిస్తున్న రాజ్యానికి రక్షణగా, అధికార కేంద్రంగా దూరదృష్టితో నిర్మించిన దండు దుర్గం. రాజోద్యోగులు, వారి కుటుంబాలు లోపలే నివాసం ఉంటున్నారు. దుర్గాధ్యక్షుడూ దండనాయకుడూ అయిన గణపతీ, వారి ఇద్దరు భార్యలూ, దాసదాసీజనం తోట మధ్యలో ఉంటారు. వీరనాయకుడు వెళ్లినపుడల్లా అక్కడే వారిని కలుస్తూంటాడు. వీరనాయకుడు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2300**

* * *